ప్రజాశక్తి
బుధవారం 14 డిసెంబర్ 2022 5
శ్రీ సత్యసాయి

రీసర్వే అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు..
అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పిఎబిఆర్‌కు మహర్దశ వచ్చేనా..?

పిఎబిఆర్ జలాశయం..

◆ఈ నెల కేంద్ర నిపుణుల బృందం రాక

◆డ్యామ్ భద్రతపై కమిటీ పరిశీలించే అవకాశం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో ప్రధానమైన జలాశయాల్లో పెన్నఅహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పిఎబిఆర్) ఒకటి. 11 టిఎంసిల నిలువ సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే అనేక లోపాలు చోటు చేసుకున్నాయి. దీంతో ఇప్పటికి ఐదున్నర టిఎంసిలకు మించి నిలువ చేయలేని పరిస్థితుల్లో ప్రాజెక్టు ఉంది. క్రస్టు గేట్లు స్లూయిస్ నుంచే నీరు లీకేజీ అవుతోంది. దీన్ని నివరించేందుకు గ్రౌటనింగ్ పనులు చేశారు. అయినా పూర్తి స్థాయిలో నిలువరించలేకపోయారు. వర్షాలు అధికంగా వచ్చినా అవకాశముండి నీటిని నిలువ చేయడం లేదు. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టు లోపలి భాగంలో జియో మెమ్రైన్ చేసి నీటిని నిలువ చేయాలన్న ఆలోచన ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపడుతున్నా డ్యామ్ రిహాబిలేషన్ అండ్ ఇప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు (డ్రిప్) కింద దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఎంపిక చేసిన ప్రాజెక్టుల పునరుద్ధరణ పనులు చేపడుతోంది. మూడు విడతల్లో చేపడుతున్న పనుల్లో మొదటి విడతలో కొన్ని పూర్తయ్యాయి. ప్రస్తుతం రెండో విడత కింద ఆయా రాష్ట్రాల్లో కేంద్ర బృందాలు పర్యటించి అవసరమనకున్న ప్రాజెక్టులను పరిశీలించి పునరుద్ధరణ పనులు చేపట్టే అవకాశాలున్నాయి. ప్రస్తుతం రెండో విడత కింద రాష్ట్రంలో నాలుగు ప్రాజెక్టులను కేంద్ర నిపుణుల బృందం పరిశీలించనున్నారు. ఈ నెల మూడవ వారంలో ఈ బృందం రాష్ట్రానికి వచ్చే అవకాశముంది. అందులో జిల్లాలోని పిఎబిఆర్ ప్రాజెక్టు ఉన్నట్టు సమాచారం. దీంతోపాటు ప్రకాశం జిల్లాలో రోళ్లపాడు, పశ్చిమగోదావరి జిల్లాలో తమ్మిలేరు. కడప జిల్లాలో సోమశిల ప్రాజెక్టులున్నట్టు సమాచారం. నిపుణుల బృందం పరిశీలించి ఈ ప్రాజెక్టు పునరుద్ధరణ ఆవశ్యమని భావిస్తే డ్రిప్ కింద చేర్చడం జరుగుతుంది. తద్వారా ప్రత్యేకంగా నిధులను విడుదల చేసే అవకాశమున్నట్టు జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ సమాచారం రావడంతో జిల్లాలోని జలవనరుల శాఖ అధికారులు నివేదికలను రూపొందించే పనిలో పడ్డారు. ఈ ప్రాజెక్టు అవశ్యకత, డ్యామ్ లోటుపాట్లను నిపుణుల బృందానికి వివరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ బృందానికి సరైన సమాచారాన్ని అందించి, ప్రాధాన్యతను వివరించేందుకు వీలుగా జలవనరుల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో ప్రధానమైన ప్రాజెక్టు కూడా కావడంతో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. కమిటీ ఈ ప్రాజెక్టు డ్రిప్ జాబితాలో చేరిస్తే ఇప్పటి వరకున్న ఆటంకాలు, సమస్యలు కొంత వరకు తొలగి, పూర్తి స్థాయి సామర్థ్యంతో రిజర్వాయర్‌లో నీరు నిలువ ఉంచేందుకు వీలు కలుగుతుంది.

నివేదికలు రూపొందిస్తున్నాం..

కేంద్ర నిపుణుల బృందం వస్తున్నట్టు ప్రభుత్వం నుంచి సమాచారం అందింది. ఈ మేరకు అవసరమైన నివేదికలను ఇంజనీర్లను ద్వారా రూపొందించే పనిలో ఉన్నాం. వారు వచ్చే సమయానికి అన్ని సిద్ధం చేసి ప్రాజెక్టు ఆవశ్యకతను వారికి వివరించి జిల్లాకు ప్రధాన ప్రాజెక్టును డ్రిప్‌లో ఉండే విధంగా కృషి చేస్తాం.

రాజశేఖర్‌బాబు,
హెచ్‌ఎల్‌సి, ఎస్‌ఇ.

వివాదాలు లేకుండా రీసర్వే

◆వంద శాతం అధికారులు శ్రద్ధ వహించాలి

◆రెవెన్యూ అధికారులు ప్రధాన బాధ్యత తీసుకోవాలి

◆కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా రీసర్వే నిర్వహించేలా రెవెన్యూ అధికారులు అన్ని చర్యలూ తీసుకోవాలని కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కదిరి పట్టణంలోని షాదిమహల్లో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం-2020పై తహశీల్దార్లు, ఎంపిడిఓలు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, ఈఓఆర్డీలు, విఆర్‌ఒలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ భాగ్యలక్ష్మి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వేలో రెవెన్యూ అధికారులదే స్పష్టమైన బాధ్యత ఉందన్నారు. జిల్లాలో ఎక్కడైనా పొరపాటు జరిగి భూ హక్కు పత్రాలు ఇవ్వడంలో లోకభూయిష్టంగా వ్యవహరిస్తే అధికారులు చాలా విపత్కర పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 2వ తేదీ నాటికి మొదటి విడతలో భూ హక్కు పత్రాలు రెండు వేల గ్రామాల్లో ఇస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పారన్నారు. ఈ లక్ష్యాన్ని చేరుకోకపోవడం వల్ల ఉన్నతాధికాలను బదిలీ చేయాల్సి వచ్చిందన్నారు. అధికారులు రీ సర్వే, భూహక్కు పత్రాల పంపిణీపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. రీసర్వేని సమర్థవంతంగా, విజయవంతంగా, ఎలాంటి తగాదాలకు ఆస్కారం లేకుండా ముగించాల్సిన అవసరం ఉందన్నారు. భూ యజమానికి ఎలాంటి వివాదాల్లేకుండా శాశ్వతంగా మనశ్శాంతి ఇవ్వాలనే ఉద్దేశంతో భూహక్కు పత్రాల పంపిణీ ప్రక్రియను అమలు చేస్తున్నారు. 22ఎ, డాటెడ్ ల్యాండ్ విషయంలో భూ యజమానికి మనశ్శాంతిని అందించేలా రెవెన్యూ అధికారులు కషి చేయాలన్నారు. భూ యజమానులు చెప్పగలిగే రెవెన్యూ శాఖకు సార్థకత వచ్చినట్లు అన్నారు. అందువల్ల రీ సర్వే ప్రక్రియను జాగ్రత్తగా చేపట్టాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ రీసర్వేపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని అన్ని రకాల అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సకాలంలో రీసర్వే పూర్తిచేసేందుకు అధికారులు అందరూ కలిసికట్టుగా కషి చేయాలన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద రీసర్వేలో పలు రకాల అంశాలపై పెనుకొండ డిఐఓఎస్ చిట్టిబాబు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, తదితరులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో తిప్పాయ్య నాయక్, కదిరి ఆర్డీవో రాఘవేంద్రతో పాటు తహశీల్దార్లు, ఎంపిడిఓలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డివైఈవోలు, ఎంఈవోలతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి డిఇఒ వెంకటకృష్ణారెడ్డి

బదిలీల్లో అందరికీ సమన్యాయం

ఇన్‌ఛార్జి డిఇఒ ఎం.వెంకటకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురంసిటీ

టీచర్ల బదిలీల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరక్కుండా అందరికీ సమన్యాయం చేయాలని ఆర్జేడీ, ఇన్‌ఛార్జి డీఈవో ఎం.వెంకటక్రిష్ణారెడ్డి డీవైఈవోలు, ఎంఈవోలను ఆదేశించారు. మంగళవారం నగరంలోని జిల్లా సైన్స్ సెంటర్లో టీచర్ల బదిలీలపై ఉమ్మడి అనంతపురం జిల్లా డీవైఈవోలు, ఎంఈవోలు, ఎంఐఎస్, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజాగా టీచర్ల బదిలీల షెడ్యూల్ వచ్చిందన్నారు. జీరో సర్వీస్, ఐదేళ్లు, ఎనిమిదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ బదిలీలకు అర్హులన్నారు. బదిలీలకు దరఖాస్తు చేసుకున్న ప్రతిదరఖాస్తున్ని క్షుణంగా పరిశీలించాలన్నారు. ప్రైమరీ, యుపి, హైస్కూల్ యూడైస్ కరెక్ట్‌గా ఉన్నాయో లేదో చూసుకోవాలన్నారు. ఎల్‌పిటి, పిఈటీ, ఫిజికల్ సైన్స్ టీచర్లు ఎక్కడ పనిచేస్తున్నారో వారి వివరాలు ఖచ్చితంగా ఉండాలన్నారు. సాయంత్రంలోపు ఖాళీల వివరాలను పక్కాగా అందజేస్తే వాటిని తాము బుధవారం కమిషనర్ వద్దకు తీసుకెళ్తామన్నారు. మెడికల్, స్పౌజ్ సర్టిఫికెట్లను కరెక్ట్‌గా ఉన్నాయో లేదో చూసుకోవాలన్నారు. బదిలీల్లో ఏమైనా సందేహాలుంటే తమ దష్టికి తీసుకురావాలన్నారు. డీవైఈవోలు, ఎంఈవోలు అనంతపురం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఉద్యోగులతో సమన్వయం చేసుకుని బదిలీ ప్రక్రియను ప్రశాంతంగా, పారదృకంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ డీవైఈవో రంగస్వామి, ధర్మవరం డీవైఈవో మీనాక్షి, అనంతపురం డీవైఈవో పద్మప్రియ, గుత్తి డీవైఈవో శంకర ప్రసాద్, అనంతపురం డీఈవో ఆఫీస్ ఏడీ క్రిష్ణయ్య, శ్రీ సత్యసాయి జిల్లా డీఈవో ఆఫీస్ ఏడీ నాగరాజు, సూపరింటెండెంట్లు శ్రీనాథ్, ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జుల పాలనతో ఇబ్బందులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మూసివేసిన ఆర్ఐ గది

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఇన్‌ఛార్జిల పాలన, తగినంత సిబ్బంది లేక పాలన అస్తవ్యస్తంగా తయారైందని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్, ఇద్దరు ఆర్ఐలు, ఐదుగురు వీఆర్వోలు ,ఒక సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలంలో కొన్ని గ్రామాల్లో రీ సర్వే పనులు జరుగుతున్నాయి అదేవిధంగా నాసన్, బెల్ ప్రభుత్వ సంస్థలకు కేటాయించిన భూమి కి సంబంధించిన రైతులు పరిహారం కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎనిమిదో విడత భూ పంపిణీ సాగుదారులకు పట్టాలు కేటాయించడంలో తగినంత సిబ్బంది లేకపోవడంతో సాగుదారులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. తహశీల్దార్ పలు ప్రభుత్వ పనుల నిమిత్తం కార్యాలయానికి రాకపోతే కుల, ఆదాయ ధ్రువీకరణ తదితర పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది.ఉన్న వీఆర్వోలను పలు గ్రామాలకు ఇన్‌ఛార్జులుగా నియమించడంతో వారు తమకు కేటాయించిన గ్రామాలకు, ఇన్చార్జి గ్రామాలకు ఇటు కార్యాలయానికి తిరగటంతోనే సమయం వృథా అవుతోంది. పూర్తి సమయాన్ని పరిపాలన కేటాయించలేక పాలన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. జిల్లా అధికారులు సోమందేపల్లి తహశీల్దార్ కార్యాలయంపై దృష్టి సారించి తగినంత సిబ్బందిని కేటాయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ధర్మవరం యువతికి జనసేన చేయూత

వివరాలు వెల్లడిస్తున్న 'చిలకం'

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరానికి చెందిన యువతికి జనసేన పార్టీ చేయూతను అందించింది. పవన్‌కళ్యాణ్ గతంలో ధర్మవరంలో పర్యటించిన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు యువతికి చేయూతను అందిస్తున్నట్లు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మదుసూదన్ రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతు భరోసా యాత్రలో భాగంగా బాధిత కుటుంబాలను పరామర్శించడానికి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ధర్మవరంలో గతంలో పర్యటించిన సందర్భంగా గొట్లూరు గ్రామంలో అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు నిట్టూరు బాబు కుటుంబ సభ్యులను పరామర్శించారన్నారు. ఈ క్రమంలో నిట్టూరుబాబు పెద్దకుమార్తె హాలీమాను పరామర్శించిన పవన్ ఆమె విద్యాభ్యాసంపై ఆరా తీశారన్నారు. తాను డిగ్రీ పూర్తి చేశానని భవిష్యత్తులో ఎస్ఐ కావాలనుకున్నానని యువతి పవన్‌కళ్యాణ్‌కు తెలిపారన్నారు. అందుకు స్పందించిన పవన్ ఎస్ఐ అవ్వడానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అప్పట్లో హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఎస్ఐ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కావడంతో హాలీమాకు కోచింగు అయ్యే ఖర్చుతోపాటు హాస్టల్, ఫిలిమ్స్ క్వాలిపై అవ్వగానే, ఫిజికల్ టెస్టుల తరువాత మెయిన్స్ పరీక్షలకు మొత్తం ఖర్చులన్నీ జనసేన పార్టీ తరపున పవన్ కల్యాణ్ భరిస్తున్నట్లు చిలకం తెలిపారు. దీంతో యువతి హాలీమా పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి దాసరి రామాంజనేయులు, నాయకులు లింగాలప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకులకోన్యాయం, దళితులకో న్యాయమా..?

ధర్మవరం టౌన్ : సోషియల్ మీడియాలో పోస్టులు చేసినప్పుడు అధికారం పార్టీ నాయకులకు ఒక న్యాయం దళితులకు మరొక న్యాయం చేస్తారా అని ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రేగాటిపల్లి వరదరాజులు ప్రశ్నించారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయనతోపాటు టీడీపీ ఎస్సీసెల్ నాయకులు సాక్షి ఆదినారాయణ. మల్లికార్జున, సుబ్రమణ్యం తదితరులు స్థానిక విలేకరులతో మాట్లాడారు. సోషల్ మీడియాలో పోస్ట్ చేసినందుకు ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి కొంకరి కమలమ్మపై పోలీసులు అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడం దారుణమన్నారు. అదే వైసీపీ నాయకులు ఎలాంటి పోస్టు పెట్టిన వారికి చట్టాలు వర్తించవా అని ప్రశ్నించారు.

ప్రజల చెంతకే పాలన : వైసిపి

కదిరి టౌన్ : ప్రజల చెంతకే పాలన తీసుకొచ్చామని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. కదిరి మున్సిపాలిటీ, కుటాగుళ్ల-, 2వ వార్డు పరిధిలోని జీవిమాను సర్కిల్‌లో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందుతున్న ప్రజాసంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా సాదిక్, కమిషనర్ శ్రీహరి బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ రమేష్ రెడ్డి , వైసీపీ యువ నాయకులు ప్రణీత్ రెడ్డి, కౌన్సిలర్లు మహమ్మద్, ఆవుల స్వామి, ఇస్మాయిల్, రంగారెడ్డి, కపాకర్ రెడ్డి, రాంప్రసాద్, ఖాసీం, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు నాగరాజు, టెంపుల్ డైరెక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : సంక్షేమం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని శాసనసభ్యుడు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగర పంచాయతీ పరిధిలోని పెద్ద కమ్మవారి పల్లి, దొమ్మిరిండ్లు గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి జరుగుతోందన్నారు. దొమ్మిరిండ్లు కు రహదారి అధ్వానంగా ఉందని వర్షాకాలంలో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆ కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకురాగా రహదారి మరమ్మత్తులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబులపతి, కమిషనర్ వెంకటరామిరెడ్డి, వైస్ చైర్మన్లు తిప్పన్న, శ్రీ లక్ష్మీ నారాయణ రెడ్డి, సందీప్ నాయుడు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూసేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నారని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. మంగళవారం పురపాలక సంఘ పరిధిలోని34వ వార్డు మేళాపురం తదితర ప్రాంతాలలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ డిఎన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ జబివుల్లా, వార్డు కౌన్సిలర్ నాగమణితో కలిసి ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్న తీరును తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, కౌన్సిలర్లు మద్దన జయరాములు, మల్లికార్జున, ముస్తక్, అయూబ్‌చ నాగేంద్రమ్మ, నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానికులతో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యేలు సిద్ధారెడ్డి, శ్రీధర్‌రెడ్డి

మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

వాహనాలకు వేలం పాటను నిర్వహిస్తున్న పోలీసులు

వాహనాల వేలంలో నిబంధనలకు తిలోదకాలు

ప్రజాశక్తి మడకశిర

ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 29 వాహనాల వేలంపాటో అదికారులు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. మంగళవారం నిర్వహించిన వాహనాల వేలం పాటలో పలువాహనాలను గంపగుత్తగా మెకానిక్‌లకు కట్టబెట్టినట్లు పలువురు పాటదారులు ఆరోపించారు. పేరుకే బహిరంగ వేలం కానీ అక్కడ అంతా గోప్యంగా అయినవారికి కంచాల్లో కాని వారికి ఆకుల్లో వడ్డించిన చందంగా అధికారులు వ్యవహరించి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టారన్న నట్లు విమర్శలు వ్యక్తమయ్యాయి. 29 వాహనాలకు గాను 22 వాహనాలు మాత్రమే బహరంగంగా చూపించి వేలం పాట నిర్వహించారని సమాచారం. 3వేల రూపాయలు దరవత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొంటే మూడు నాలుగు వాహనాలు వేలం వేసిన తరువాత గంపగుత్తగా మెకానిక్‌లకు వాహణాలను కారు చౌకగా అప్పగించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారన్న ఆరోపణలు వినిపించాయి. ఏదైనా ఒక వాహనాన్ని వేలం వేయాలనుకుంటే ఆ వాహనాన్ని ముందు ఉంచి వేలం పాటను నిర్వహిస్తారు. అయితే వాహనాన్ని చూపకుండా వేలం పాట నిర్వహించడం ఏమిటని పాటదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రశ్నించిన వారికి నిర్లక్ష్యపు సమాధానాలు ఇస్తున్నారని పాటదారులు వాపోతున్నారు. అంతేకుండా తమకు అనుకూలమైన వారికి సర్కారు పాట కంటే తక్కువగా అప్పజెప్పారని ఆరోపస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రణాళికతో చదివితే విజయం తథ్యం

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు పదవ తరగతిలో మంచి పలితాలు సాదించాలంటే ఒక ప్రణాళికతో చదవాలని ప్రశాంతి మల్టీ స్పెషాలిటి అసుపత్రి వైద్యులు సాదీన్‌రెడ్డి సూచించారు. మార్చిలో జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో మంగళవారం పట్టణంలోని పాంచజన్య పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో ప్రశాంతి మల్టీ స్పెషాలిటీ అసుపత్రి వైద్యులు సాదీన్‌రెడ్డి, చందన దీప్తిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతు ఏ ఉద్యోగం, ఉన్నత చదువుకు వెళ్లాలన్నా పదవ తరగతి మార్కులే విలువైనవన్నారు. పదిలో మంచి ఫలితాలు సాధించాలంటే పట్టుదలతో విద్యార్థులు శ్రమించాలన్నారు. చదువుతు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదన్నారు. అటు చదువు ఇటు ఆరోగ్యం రెండు ముఖ్యమన్నారు. దీని కోసం ఒక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం వైద్యులు 150మంది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి పాఠశాల యాజమాన్యం తరపున ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్, సెక్రెటరీ నందకుమార్, ఎఒ భాస్కర్, హెచ్ఎం గాయిత్రి, ఎహెచ్ఎంలు విజయేంద్ర, శశికళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

ప్రజాశక్తి
www.prajasakti.com

విజ్ఞానశాస్త్రంపై అవగాహన అవసరం

కొత్తచెరువు: విద్యార్థులు చిన్నప్పటినుండి విజ్ఞాన శాస్త్రం పట్ల అవగాహన కలిగి ఉండాలని నోడల్ అధికారి చెన్నక్రిష్ణారెడ్డి, డిఎస్ఓ ఆనంద భాస్కర్, కన్వీనర్ నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఇందులో 29 విజ్ఞాన శాస్త్ర ప్రయోగాలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలు డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వెంకటేశ, లెక్చరర్ గోవిందరాజులు, రాధిక తదితరులు విద్యార్థుల ప్రతిభను గుర్తించి విజేతలను ఎంపిక చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సోమందేపల్లి : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సోమందేపల్లి వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో రైతులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక ఎల్లీశ్వర్ సర్కిల్‌లో మంగళవారం నిర్వహించారు. ఏడీసీసీ బ్యాంక్ సూపర్వైజర్ గంగాధర్, సీఈవో శ్రీనివాసులు, స్థానిక సింగిల్ విండో ప్రెసిడెంట్ కొల్లప్ప ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది జయ రాములు, నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో తుగ్లక్ పాలన'

ధర్మవరం టౌన్ : రాష్ట్రంలో తుగ్లక్ పాలన సాగుతోందని బిజెపి జిల్లా అధ్యక్షుడు వజ్రభాస్కర్‌రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ. పట్టణ అధ్యక్షుడు డిష్ రాజు స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మవరంలో నియంత పాలన సాగుతోందన్నారు. ఈసమావేశంలో నాయకులు చిగిచెర్ల అరవిందరెడ్డి, గూండాపుల్లయ్య, భక్తవత్సలం, చిలకంసూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదిరి ప్రశ్నాపత్రాలు పంపిణీ

ఓబుల దేవర చెరువు : మండల పరిధిలోని కొండకమర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పండమంది విద్యార్థులకు రోటరీక్లబ్, యుటిఎఫ్ ఆధ్వర్యంలో మాదిరి ప్రశ్న పత్రాలను, పుస్తకాలను అందజేశారు. సేగు సింధుజ , సాగర్ దంపతుల కుమారుడు మన్విత్ పుట్టినరోజు సందర్భంగా వారు విద్యార్థులకు వీటిని పంపిణీ చేసినట్లు యుటిఎఫ్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కర్, అధ్యక్షత వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ కదిరి ప్రెసిడెంట్ రంజిత్, క్లబ్ సభ్యులు తాహీర్ వలి, నేతి అభినయ్, ఉపాధ్యాయులు భాదరీబాషా, రామాంజనేయులు, యశోద తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన కదిరి నాయకులు

తనకల్లు : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబును హైదరాబాదులోని ఆయన నివాసంలో కదిరి నాయకులు కలిశారు. హిందూపురం పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు షేక్ బాబ్జాన్, కదిరి నియోజకవర్గ అధ్యక్షుడు గంగయ్య నాయుడు,తనకల్లు మండల తెలుగు యువత అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్, కదిరి పట్టణ యువత అధ్యక్షుడు కాటం మనోజ్, నల్లచెర్వు మండల తెలుగు యువత అధ్యక్షుడు గుత్తా ప్రసాద్, కదిరి 15 వ వార్డు ఇన్‌ఛార్జి హైదర్ తదితరులు నారాలోకేష్‌ను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ స్థితిగతులపై తమతో లోకేష్ ఆరా తీసినట్లు నాయకులు తెలిపారు. పార్టీకి పూర్వవైభవం తీసుకురావటానికి కృషి చేయాలని సూచించారని చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కదిరి విద్యార్థులు

కదిరి టౌన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అనంతపురం ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనపర్చిన కదిరి విద్యార్థులు రాష్ట్రస్థాయి బాక్సింగ్, ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు కరాటే కోచ్ షేక్షావలి తెలిపారు. కోచ్ షేక్షావలి ఆధ్వర్యంలో వాల్మీకి, బ్లూ మూన్, సెయింట్ థామస్,జాయిన్,శ్రీ చైతన్య, జడ్‌పిహెచ్‌ఎస్ గర్ల్స్, బాయ్స్ హై స్కూల్,స్పేస్ జూనియర్ కాలేజీ, జడ్పీహెచ్‌ఎస్ నల్లచెరువు, ఓడిసి విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ అక్రమాలపై విచారణకు డిమాండ్

కొత్తచెరువు : కొత్తచెరువు మేజర్ గ్రామపంచాయతీలో జరిగిన అక్రమాలపై విచారణ నిర్వహించాలని పుట్టపర్తి డివిజన్ సిపిఎం నాయకులు గౌస్, మండల కార్యదర్శి గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఇద్దరు కార్యదర్శులు దాదాపు రూ. 80 లక్షల దాకా నిధులను దుర్వినియోగం చేశారన్న కారణంతో ప్రభుత్వం వారిని సస్పెండ్ చేసిందన్నారు. అయితే ఇప్పటికీ వారి నుండి నిధులను రికవరీ చేయలేదన్నారు ఇదిలా ఉండగా ప్రస్తుతం ఏడాదిన్నరగా గ్రామపంచాయతీలో పంచాయతీ గదుల పన్నులు వసూలు చేసి ఆ మొత్తాన్ని పంచాయతీ అకౌంట్‌కు జమ చేయకుండా స్వాహా చేశారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై అధికారులు స్పందించి తక్షణమే విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ముత్యాలు, లక్ష్మన్న, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలకు వైద్యుల నియామకం

హిందూపురం : పురపాలక సంఘంలోని పట్టణ ఆరోగ్య ఉపకేంద్రాలకు ఇద్దరు వైద్యులను ప్రభుత్వం నియమించినట్లు పిపి యూనిట్ వైద్యాధికారిణి జయం పద్మజ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతు నూతనంగా నియమించిన వైద్యులు మంజుశ్రీ, ఆయీషా తస్నీమ్‌లను పట్టణంలోని లక్ష్మీపురం, బోయపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్యాధికారులుగా జిల్లావైద్య, ఆరోగ్య శాఖధికారి నియమించినట్లు తెలిపారు.

గ్రామాభివృద్ధిపై శిక్షణ

నల్లచెరువు : మండలంలోని ఆయా గ్రామా పంచాయతీలకు సంబంధించి అభివృద్ధి ప్రణాళికలపై స్థానికఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శకుంతల నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 2023 – 24 వ సంవత్సరానికి సంబందించి పంచాయతీల అభివృద్ధి కోసం ప్రణాళికల తయారీలో గ్రామస్థాయి,సచివాలయ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాలని కోరారు. జనవరి నెలాఖరు లోపు సర్పంచుల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించుకుని ఆమోదం పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో విస్తరణాధికారి రామకృష్ణ, వివిధ గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక పై శిక్షణా కార్యక్రమాన్ని ఎంపిడిఒ వెంకటేశ్వరావు అధ్యక్షతన మంగళవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, మేజర్ పంచాయతీ సర్పంచి గంగాదేవి నరసింహమూర్తి, కన్వీనర్ నారాయణరెడ్డి, సర్పంచులు నిర్మలమ్మ, గంగమ్మ, గిరిజమ్మ నాగరాజురావు, వైస్ ఎంపీపీ రత్నమ్మ నారాయణ, ఎంపీటీసీలు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళ వారం ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో రాబర్ట్ విల్సన్ ఆధ్వర్యంలో ఎంపీపీ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 2023 – 24 వ సంవత్సరానికి సంబందించి ఆయా పంచాయతీలు చేపట్టే అభివృద్ధి ప్రణాళికల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకోండి

తాడిమర్రి : అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండలంలోని మద్దెల చెరువు గ్రామంలో వర్షాలకు నష్టపోయిన పంటలను పరిశీలించారు. గ్రామంలోని రైతు చలపతి కి చెందిన వ్యవసాయ భూమిలో టమోటా పంటను పరిశీలించారు. వర్షాలకు నష్టపోయిన టమోటా, వరి ,అరటి రైతులకు ఎకరాకు లక్ష రూపాయలు చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మారుతి, రమణ తదితరులు పాల్గొన్నారు.

చెడిపోయిన టమోటాను పరిశీలిస్తున్న నాయకులు

గొర్రెల పెంపక క్షేత్రం స్థలంలో

టౌన్‌షిప్ ఏర్పాటు నిర్ణయం ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి -పెనుకొండ

గొర్రెల పెంపక క్షేత్రం స్థలంలో జగనన్న స్మార్ట్ సిటీ టౌన్ షిప్ ఏరాపటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వ్యకాసం, సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సిపిఎం మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ గొర్రెల పెంపక క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తూ గొర్రెల వృత్తిదారులను కాపాడాలని కోరారు. పెనుకొండ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ గొర్రెల పెంపకం క్షేత్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. గొర్రెల పెంపక క్షేత్రాన్ని సంబంధించిన భూమిలో ఇప్పటికే మెడికల్ కాలేజీ కోసం 50 ఎకరాల భూమిని కేటాయించారని దీంతో పాటు జగనన్న స్మార్ట్ సిటీ టౌన్‌షిప్ పేరుతో లేఅవుట్ అనుమతులు ఇస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారాలను కొనసాగించడానికి ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. గొర్రెల వత్తిదారులను మోసం చేస్తూ 60 ఎకరాల భూమిని కేటాయించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వం తన ఆలోచనలను విరమించుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి నిరసన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గంగాధర్, వెంకటరాముడు, సిఐటియు నాయకులు తిప్పన్న, రెడ్డప్ప రెడ్డి, నాగప్ప, మురళి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతున్న నాయకులు

విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన

ప్రజాశక్తి బత్తలపల్లి

బత్తలపల్లి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ఎంఇఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఎఐఎస్ఎఫ్, టిఎన్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. మంగళవారం బత్తలపల్లిలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు పోతలయ్య, ప్రతాప్, ఇర్షాద్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో మౌళిక సదుపాయాలను కల్పించాలని, అదేవిధంగా సౌత్ స్కూల్ విద్యార్థుల్ని వెంటనే పాఠశాలలో చేర్చుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ఎంఇఒ చాముండేశ్వరి, హెచ్‌ఎం నాగరత్నమ్మ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగదీష్, హరి, మురళి, నవీన్, విజయ్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

బురదమయమైన గ్రామీణ రహదారి

అధ్వానంగా గ్రామీణ రహదారులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండూస్ తుఫాన్ దాటికి మండల పరిధిలోని చిన్నన్నపల్లి,మధురేపల్లి,ఎస్ ముదిరెడ్డిపల్లి,దోర్నాలపల్లి గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాలకు వెల్లే రహదారులతో పాటు,గ్రామల్లోని వీధుల్లోనూ ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. ఇక పాఠశాలలకు వెల్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటితో పాటు కేజీబీవీ పాఠశాల ముందు ప్రాంతం బురదమయంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉద్యోగాల కల్పనలో వయోపరిమితి సడలించాలి : టిడిపి

ప్రజాశక్తి-పెనుకొండ

పోలీసు ఉద్యోగాల అభ్యర్థించే నిరుద్యోగులకు వయసు పరిమితిని సడలించాలని టీడీపీ నాయకులు కోరారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో ఆర్థిక పరిస్థితులు బాగా లేవన్నారు. వైసిపి ప్రభుత్వం నిరుద్యోగులను నిలువునా ముంచుతోందన్నారు. ప్రతి ఏడాది జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ప్రకటించిన పోలీసు, ఎస్ఐ ఉద్యోగాల అభ్యర్థులకు ఐదు సంవత్సరాల వయసు సడలించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు మాధవ నాయుడు, శ్రీరాములు, శ్రీనివాసులు, నరసింహులు, త్రివేంద్ర నాయుడు, సుబ్రహ్మణ్యం, బాబుల్ రెడ్డి, మంజునాథ్, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు

ఉమర్ ఫారూక్ ఖాన్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి-హిందూపురం

ప్రపంచ తెలుగు రచయితల సంఘం, తానా సంయుక్తంగా నిర్వహిస్తోన్న 5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు హిందూపురం పట్టణానికి చెందిన ఉమర్ ఫారూక్ ఖాన్‌కు ఆహ్వానం లభించింది. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతు ఈ నెల 23, 24న విజయవాడలోని పిబి. సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో కృష్ణా జిల్లా రచయితల సంఘం సహకారంతో ప్రపంచ తెలుగు రచయితల సంఘం, తానా సంయుక్తంగా 5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి తనకు ప్రత్యేక ఆహ్వానం అందడం సంతోషంగా ఉందన్నారు. వేలాది మంది ప్రపంచ తెలుగు ప్రజల సమక్షంలో ఉసురు తీసే రైతు చట్టాలపై, భారతీయ ద్రావిడ మూల వాసీ ముస్లింని అను నేను అనే రెండు శీర్షికల పేరుతో కవితలను వినిపించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశం కల్పిస్తున్న నిర్వాహకులు జివి పూర్ణ చందు. గుత్తి కొండసుబ్బారావు తదితరులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.

ఉమర్ ఫారుఖ్ ఖాన్

వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి : టిడిపి

ధర్మవరం టౌన్ : వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందనిటిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ విమర్శించారు. పట్టణంలోని 25వ వార్డులో మంగళవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. వర్షంలో తడుస్తూ ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. వార్డులో ఎక్కడ చూసిన రోడ్లన్నీఅస్తవ్యస్థంగా తయారై వర్షం వస్తే బురదగుంటలుమారి నడవలేని పరిస్థితులు ఉన్నాయని ప్రజలు పరిటాల శ్రీరామ్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక పరిశ్రమలన్నీ వెళ్లిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే మాటలు చూస్తే కోటలు దాటుతున్నాయని చేతలు గడపకూడా దాటడం లేదని ఎద్దేవా చేశారు. వైసీపీ నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, సెటిల్మెంట్లకే పరిమితమయ్యారని ప్రజాసమస్యలు పట్టించుకునే తీరిక వారికి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్, భీమనేని ప్రసాదనాయుడు, చింతపులుసు పెద్దన్న, రాంపురంశీన, పఠాన్ బాబూ ఖాన్, నాగూరుసేన్ తదితరులు పాల్గొన్నారు.

మృతునికి నివాళి : పట్టణంలోని 29వ వార్డు టిడిపి కమిటీ సభ్యుడు సుధాకర్ మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆపార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

తలుపుల: మండల పరిధిలోని బురుజుపల్లి, మాడికవాండ్ల పల్లి,టీచర్స్ కాలనీ,కుమ్మరకుంటలో టిడిపి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన ప్రభుత్వానికి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. టిడిపి మండల కన్వీనర్ ముబారక్ ఆపార్టీ మండల పరిశీలకులు బండారు మనోహర్ నాయుడు, పల్లపు రామాంజనేయులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజా రెడ్డి, జయచంద్ర ,శ్రీనివాసులు, నారాయణ రెడ్డి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల పరిధిలోని రెక్కమానులో టిడిపి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కదిరి మహిళా నాయకురాలు పర్వీన్ భాను, టిడిపి మండల కన్వీనర్ సి కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు సంబంధించిన కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఎస్ శివప్ప నాయుడు, మాజీ ఎంపీపీ గంగరాజు, నాయకులు ప్రసాద్, ఆంజనేయులు నాయక్, రవిబాషా తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస మూర్తి నాయకులకు కార్యకర్తలకు. పిలుపునిచ్చారు. మండల పరిధిలోని బాలేపల్లి గ్రామంలో చేపట్టిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఒక్క ఛాన్స్ అనే పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రజలను తీవ్రంగా మోసం చేశారన్నారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి నారాయణప్ప, నాయకులు రాజు, మద్దన కుంటప్ప, దుర్గేష్ గౌడ్, శివకుమార్, మంజునాథ్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని ఆపార్టీ పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ అన్నారు .ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలో కుటాగుల లోని 2 వ వార్డులో నాయకులు చింత రమణ ఆధ్వర్యంలో నాయకులు పర్యటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ, గంగన్న, రమేష్, బాబ్జాన్, షాకీర్, నాగభూషణ, హరి, అక్బర్, సరస్వతి, వెంకటరమణ శారద తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: 2024 ఎన్నికలలో టిడిపికి పూర్వవైభవం తీసుకువద్దామనిమాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగర పంచాయతీ పరిధిలోని కోవెలగుట్టపల్లి, రాయలవారిపల్లి, ఎనుములపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో పల్లె పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజలపై మోపుతున్న బారాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, మాజీ మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, నాయకులు మహమ్మద్ రఫీ, సామకోటి ఆదినారాయణ, అంబులెన్స్ రమేష్, ఆవుల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

గుడిబండ మండలంలో పాల్గొన్న నాయకులు

కదిరిలో పాల్గొన్న నాయకులు

నేరాలు ఘోరాలు

చోరీ కేసుల్లో నిందితుడు అరెస్టు

హిందూపురం: కదులుతున్న రైళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని హిందూపురం రైల్వే పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ మేరకు స్థానిక రైల్వే స్టేషన్‌లో నిందితుడి అరెస్టుకు సంబందించిన వివరాలను ధర్మవరం రైల్వే సిఐ నాగరాజు వెల్లడించారు. ధర్మవరం పరిధిలోని పోట్లమర్రి గ్రామానికి చెందిన మారుతీ రైల్వే స్టేషన్లలో కదులుతున్న రైళ్లల్లో చోరీలకు పాల్పడుతున్నాడు, మంగళవారం ఉదయం హిందూపురం రైల్వే స్టేషన్‌లో అనుమానంతో తిరుగుతున్న మారుతిని అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు విచారణ చేశారు. వారి విచారణలో నిందితుడు తాను చేసిన నేరాలను అంగీకరించాడు. నిందితుడి నుంచి రూ.4.42లక్షలు విలువ చేసే 119 గ్రాముల బంగారు ఆభరణాలు, 6 సెల్ ఫోన్లు స్వాదీనం చేసుకున్నట్లు రైల్వే సిఐ తెలిపారు. ఈ సమావేశంలో హిందూపురం, అనంతపు ఎస్ఐలు బాలాజీనాయక్, విజయ్‌కుమార్, స్థానిక రైల్వే పోలీసులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఓబుళదేరవచెరువు : నల్లమాడ మండలం రెడ్డిపల్లి నుంచి కర్నాటకకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మండల కేంద్రంలోని ఐటిఐ సమీపంలో విజిలెన్స్ అధికారులు, సిఐ వెంకటరమణ సీజ్ చేశారు. నల్లమాడ మండలానికి చెందిన వ్యాపారి రంగారెడ్డి ఐషర్ వాహనంలో బియ్యాన్ని తరలిస్తుండగా సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 15 టన్నుల రేషన్ బియ్యం, ఐచర్ వాహనాన్ని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

బండ్లపల్లిలో చోరీ

తలుపుల : మండల పరిధిలోని బండ్లపల్లిలో పీర్ల చావిడిలో చోరీ జరిగింది. మౌలాలి పిరుస్వామికి సంబంధించిన 8 వెండి గొడుగులను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న సిఐ శివ శంకర్ నాయక్, ఎస్ఐ మక్బూల్‌బాషా ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మండల పరిధిలోని పులిగుండ్లపల్లి పంచాయతీ జ్యోతివాళ్ళపల్లి తండాలోని మారెమ్మ గుడిలో విగ్రహం ధ్వంసం చేసిన 24 గంటలలోపే ఈ చోరీ జరిగింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్నాటక మద్యం పట్టివేత

రొద్దం : పావగడ నుండి పెనుకొండకు ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న కర్నాటక మద్యాన్ని ఎస్ఐ నాగస్వామి ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెనుకొండ మండలం శెట్టిపల్లికి చెందిన మహిళ 188 టెట్రా ప్యాకెట్లను తరలిస్తూ పట్టుబడినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

చిలమత్తూరు : మండల పరిధిలోని పాతచామలపల్లి శివార్లలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వారి వద్ద నుండి 4 ద్విచక్రవాహనాలు 8,840 రూపాయల నగదుని స్వాదీనం చేసుకొని కేసునమోదు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ పవన్ కుమార్,పోతులయ్య, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇరుక్కుపోయిన ఇసుక ట్రాక్టర్

హిందూపురం : హిందూపురం రూరల్ మండలం బసవన్నపల్లి సమీపంలో ప్రధాన రహదారిపై ఇసుక ట్రాక్టర్ ఇరుక్కుపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. రూరల్ మండలం సంతేబిదనూరు ఇసుక రీచ్‌నుంచి హిందూపురం పట్టణానికి ఇసుకను తీసుకు వస్తున్న ఒక ట్రాక్టర్ ట్రాలీ టైరు రహదారికి చివరన మట్టిలో కూరుకు పోయింది. దీంతో ట్రాలీ రహదారి మధ్యకు తిరగడంతో ఇరువైపులా వందలాది వాహనాలు ఆగిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని ట్రాక్టర్ ట్రాలీని బయటకు తీసి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

కొత్తచెరువు : కొత్తచెరువులోని బుక్కపట్నం రోడ్డు వద్ద ఉన్న బోయ వీధికి చెందిన మాజీ వార్డ్ మెంబర్ బేల్దారి నారాయణస్వామి అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పుట్టపర్తి ఎమ్మెల్యే డి శ్రీధర్ రెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వపరంగా కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, రెడ్డప్ప రెడ్డి, వాల్మీకి శంకర్, సర్పంచి భర్త నాగరాజు, షాజహాన్, రఫీ, బళ్లారి బాబు, గిరిబాబు, పెయింటర్ కేశవ, రాము తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

పెనుకొండ : మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపురానికి చెందిన టిడిపి కార్యకర్త, కార్పెంటర్ బాషాకు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు ఫ్యాక్చర్ అయింది. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు మంగళవారం తీసుకు వెళుతుండగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ బాధితుడిని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈమెతో పాటు మధవనాడు, గుట్టూరు మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, త్రివేంద్ర నాయుడు, బాబుల్ రెడ్డి, అరుణ్ రెడ్డి, మాజీ ఎంపీపీ నరసింహులు, మాజీ సర్పంచి గయప్ప, కురుబవాండ్లపల్లి రామాంజి నేయులు, చిన్నపోతన్న కలసి తమవంతుగా మొత్తం 20 వేల రూపాయలు ఆర్థికసాయం అందజేశారు.

మృతునికి నివాళి

కదిరి టౌన్ : కదిరి పట్టణం వివర్స్ కాలనీకి చెందిన వైసిపి కార్యకర్త జగన్ తండ్రి అగిసం శ్రీరాములు మృతిచెందిన నేపథ్యంలో వైసిపి సిఇసి సభ్యులు పూల శ్రీనివాస్ రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్ నాయుడు, మోహన్ రెడ్డి, ఆత్మా రెడ్డి , పవన్, ప్రసాద్, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, అక్కులప్ప తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి సంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షులు మృతి

మడకశిర : వాల్మీకి సంఘం మడకశిర నియోజకవర్గం గౌరవాధ్యక్షులు గంగవరం ఆంజనేయులు మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. గంగవరం ఆంజనేయులు అనారోగ్యంతో బాధపడుతూ తుమకూరులో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి,ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి,మాజీ ఎమ్మెల్యేలు సుధాకర్, ఈరన్న, వైటి ప్రభాకర్ రెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

స్టాక్ పాయింట్ తనిఖీ

పెనుకొండ : పట్టణంలోని ప్రభుత్వ బియ్యం పంపిణీ నిల్వ కేంద్రాన్ని పౌరసరఫరాల రాష్ట్ర క్వాలిటీ ఆఫీసర్ నారాయణస్వామి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన సంబంధిత జిల్లా అధికారులతో కలసి స్టాక్ పాయింట్‌లోని నిత్యావసరాల నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిత్యావసరసరుకుల వివరాలను, రికార్డులను తనిఖీ చేశారు. నిల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిస్టిక్ మేనేజర్ అశ్వర్థ నారాయణ నాయక్, డిఎస్ఒ వంశీకృష్ణ రెడ్డి, స్థానిక స్టాక్ పాయింట్ ఇన్‌ఛార్జి మహేష్, సిఎస్‌డిటి ప్రభావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థుల ఎంపిక

మడకశిర: మడకశిర పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో ఐదుగురు విద్యార్థులు జిల్లాస్థాయి జరిగే వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక అయినట్లు కన్వీనర్ జ్యోతిర్మయి తెలిపారు. 14 ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు దాదాపు 100 నమూనాలను ప్రదర్శించారన్నారు. జిల్లా పరిషత్ హై స్కూల్ ఆమిదాల గొంది పాఠశాలకు చెందిన దీప్తి దినేష్ వర్షపు నీరు పంట నూర్పిడి విధానంలో రూపొందించిన నమూనా ఆకట్టుకుందన్నారు. ఈ నమూనాతో ఈ విద్యార్థి జిల్లాస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాడన్నారు. అదేవిధంగా మడకశిర పట్టణంలోని బాలికోన్నత పాఠశాలకు చెందిన కావ్య హెర్బల్ శానిటైజర్ నమూనా ప్రదర్శించి జిల్లా స్థాయికి ఎంపికైందన్నారు. జిల్లా స్థాయిలో జరిగే విద్యా వైజ్ఞానిక సదస్సులో వీరు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం జ్యూరీ సభ్యులుగా జూనియర్ కళాశాల అధ్యాపకులు భాను ప్రకాష్ బాలాజీ, బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మారుతి ప్రసాద్, శివ రుద్రప్ప, సత్యవతి వ్యవహరించారు.